# కేజ్రీవాల్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు. మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని కేజ్రీవాల్‌కు గురువారం ఈడీ తొమ్మిదోసారి సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈడీ తనను బలవంతంగా అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని కోరుతూ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను గురువారం ఉదయం విచారించిన హైకోర్టు.. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను చూపించాలని ఈడీని ఆదేశించింది. మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణను వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు కొన్ని పత్రాలు ఉన్న సీల్డ్ కవర్‌ను ఈడీ అధికారులు న్యాయస్థానానికి సమర్పించారు. దీంతో ఈ కేసులో అరెస్ట్ నుంచి కేజ్రీవాల్‌కు రక్షణ కల్పించలేమంటూ ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు ఆదేశాలు వెలువడిన గంటల వ్యవధిలోనే ఈడీ అధికారులు కేజ్రీవాల్ ఇంటికి చేరుకొని సోదాలు నిర్వహించారు. కేజ్రీవాల్‌తో సహా ఆయన కుటుంబసభ్యుల ఫోన్లలోని డాటాను ల్యాప్‌టాప్‌లోకి బదిలీ చేసి వాటిని సీజ్ చేశారు. ఈ క్రమంలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తారన్న వార్తలు వ్యాపించాయి. దీంతో కేజ్రీవాల్ న్యాయవాదుల బృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ఈ అంశాన్ని అత్యవసర జాబితాలో చేర్చి విచారణ జరుపాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరింది. ఇంతలోనే ఈడీ అధికారులు ఆయన్ని అదుపులోకి తీసుకొన్నారు. కేజ్రీవాల్‌ను పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో శుక్రవారం ప్రవేశపెట్టనున్నట్టు ఈడీ అధికారి తెలిపారు. విచారణ కోసం కస్టడీ కోరనున్నట్టు పేర్కొన్నారు.

**నోటీసులు ఇస్తామంటూ వచ్చి..**

కేజ్రీవాల్ నివాసానికి చేరుకొన్న ఈడీ అధికారులను ఆయన సన్నిహితులు, సిబ్బంది అడ్డుకొన్నారు. దీంతో పదోసారి సమన్లు ఇచ్చేందుకు వచ్చామని ఈడీ అధికారులు ఇంట్లోకి ప్రవేశించినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇంట్లోకి ప్రవేశించిన అధికారులు సోదాలు మొదలు పెట్టారు. ఇదేంటని ప్రశ్నించినవారికి సెర్చ్ వారెంట్ చూపించారు. విచారణ కోసం ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి రావాల్సిందిగా కేజ్రీవాల్‌కు అధికారులు సూచించారు. అందుకు ఆయన నిరాకరించారు. ఇంట్లోనే విచారించాలని కోరారు. కాసేపటి తర్వాత కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు.



కేజ్రీవాల్ అరెస్టుకు నిరసన తెలుపుతున్న ఆప్ ఎమ్మెల్యేపై పోలీసుల దురుసు ప్రవర్తన





ఢిల్లీలోని కేజ్రీవాల్ నివాసం ముందు భారీగా మోహరించిన ఆర్‌ఏఎఫ్ బలగాలు

## పదవిలో ఉండి అరెస్టయిన మొదటి సీఎం

సీఎం పదవిలో ఉంటూ అరెస్టైన మొదటి వ్యక్తి అరవింద్ కేజ్రీవాల్. గతంలో బిహార్ సీఎంగా ఉన్నప్పుడు లాలూప్రసాద్‌పై అరెస్టు వారెంట్ జారీ అయ్యింది. సీఎం పదవికి రాజీనామా చేసి తన భార్య రబ్రిదేవికి బాధ్యతలు అప్పగించారు. ఇటీవల అరెస్టైన హేమంత్ సోరెన్ కూడా అరెస్టుకు ముందు సీఎం పదవికి రాజీనామా చేశారు. తమిళనాడు సీఎంగా ఉన్నప్పుడే జయలలితకు శిక్ష పడింది. దీంతో ఆమె సీఎం పదవిని కోల్పోయారు. చట్టప్రకారం శిక్ష పడ్డాక పదవిని కోల్పోతారు. కేజ్రీవాల్‌పై ఆరోపణలు రుజువు కాలేదు. శిక్ష పడలేదు. కాబట్టి, సీఎంగా కొనసాగేందుకు చట్టప్రకారం అడ్డంకులుండవని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## రోజంతా హైడ్రామా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని కేజ్రీవాల్‌కు ఈడీ పలుమార్లు సమన్లు జారీచేసింది. అయితే, ఈడీ విచారణకు ఆయన గైర్హాజరవుతూ వస్తున్నారు. ఈ క్రమంలో గురువారం అధికారులు తొమ్మిదోసారి కేజ్రీవాల్‌కు సమన్లు పంపించారు. ఈ నేపథ్యంలో ఈడీ తనను బలవంతంగా అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని కోరుతూ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో అరెస్ట్ నుంచి కేజ్రీవాల్‌కు రక్షణ కల్పిస్తూ ఆదేశాలివ్వలేమని ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం ఈ కేసు పురోగతి దృష్ట్యా ఇందులో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తేల్చి చెప్పింది. విచారణను ఏప్రిల్ 22కు వాయిదా వేసింది. దీంతో డజను మందితో కూడిన ఈడీ బృందం కేజ్రీవాల్ నివాసానికి చేరుకొన్నది. అడ్డుకొన్న కేజ్రీవాల్ సన్నిహితులకు ఈడీ అధికారులు సెర్చ్ వారెంట్ చూపించారు. సుమారు రెండు గంటలపాటు కేజ్రీవాల్‌ను ప్రశ్నించిన అధికారులు ఆయన స్టేట్‌మెంట్లను సెక్షన్ 50 మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద రికార్డు చేశారు. అనంతరం ఆయన్ని అరెస్టు చేసి ఢిల్లీలోని ఈడీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో సీఎం నివాసానికి ఆప్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆందోళనలు చేపట్టారు. దీంతో అక్కడ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఇంటివద్ద ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్), నాలుగు కంపెనీలకు చెందిన సీఆర్పీఎఫ్ ఫోర్స్, 100 మందికి పైగా పోలీసులతో భారీగా మోహరించారు. అటు ఈడీ కార్యలయం వద్ద కూడా భద్రతా దళాలను భారీగా మోహరించారు.

## సుప్రీంకు వెళ్లే అవకాశం లేకుండా..

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): ఒకవైపు ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్న సమయంలోనే కేజ్రీవాల్ న్యాయవాదుల బృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మద్యం పాలసీ కేసులో మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఆదేశాలిచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించడాన్ని ఆ బృందం సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. ఈ అంశాన్ని అత్యవసర జాబితాలో చేర్చి విచారణ జరుపాల్సిందిగా న్యాయస్థానానికి విన్నవించింది. అయితే, కేజ్రీవాల్ బృందం పిటిషన్‌పై శుక్రవారం ఉదయం విచారించే అవకాశమున్నట్టు వార్తలు వెలువడ్డాయి. ఆ వెంటనే ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశంలేకుండా రాత్రిపూట ఉద్దేశపూర్వకంగానే ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని ఆప్ నేతలు విమర్శించారు.

## జైల్లో ఉన్నా కేజ్రీనే సీఎం

న్యూఢిల్లీ, మార్చి 21: మద్యం పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడంతో సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేస్తారా ? కాబోయే ఢిల్లీ ముఖ్యమంత్రి ఎవరు ? వంటి ప్రశ్నలు మొదలయ్యాయి. దీనికి ఢిల్లీ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీలో ప్రస్తుతం కీలక నాయకురాలిగా ఉన్న ఆతిశీ స్పష్టత ఇచ్చారు. అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కొనసాగుతారని, ఇందులో రెండో ఆలోచనే లేదని ఆమె ప్రకటించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే.. జైలు నుంచే ఆయన పని చేస్తారని ముందు నుంచే తాము స్పష్టంగా చెప్తున్నామని ఆమె పేర్కొన్నారు. కేజ్రీవాల్‌పై నేరం రుజువు కాలేదని, జైలు నుంచి పని చేయకుండా అడ్డుకునే చట్టమేదీ లేదని ఆమె చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్‌నివాస్ గోయెల్, ఆప్ ఎమ్మెల్యే సంజీవ్ ఝా కూడా.. కేజ్రీవాల్ రాజీనామా చేయబోరని, జైలు నుంచే ఆయన ప్రభుత్వాన్ని నడిపిస్తారని స్పష్టం చేశారు.

**ముఖ్యమంత్రిని అరెస్టు చేయవచ్చా ?**

రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతిని మాత్రమే పదవిలో ఉన్నప్పుడు అరెస్టు చేయడానికి వీలు లేదు. ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లు అధికార విధులకు సంబంధించి కోర్టులకు జవాబుదారీగా ఉండరు. కానీ, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులకు ఈ రక్షణ ఉండదు. చట్టం ముందు అందరూ సమానమే అనేది ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రికి కూడా వర్తిస్తుంది. కాబట్టి, ముఖ్యమంత్రిని అరెస్టు చేయడానికి చట్టపరంగా అవకాశం ఉందని న్యాయనిపుణులు చెప్తున్నారు.

## అక్కడ.. ఇక్కడ.. ఒకే తీరుగా..

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): మద్యం పాలసీ కేసులో వారం క్రితం జరిగిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు విధానం.. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు విధానం ఒకేతీరుగా ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కవిత అరెస్టు నేపథ్యంలో గత శుక్రవారం హైదరాబాద్‌లో రోజంతా హైడ్రామా నడిచింది. తొలుత ఐటీ సోదాలు జరుగుతున్నట్టు సోషల్‌మీడియాలో పెద్దయెత్తున చర్చ జరిగింది. అనంతరం ఈడీ రంగప్రవేశం చేసినట్టు వార్తలు వచ్చాయి. కోర్టు సమయం ముగిసేదాకా ఈడీ అధికారులు తనిఖీల పేరిట కాలయాపన చేశారు. ఎవరినీ రానీయకుండా కవిత ఇంటిని దిగ్బంధించారు. ఫోన్లను సీజ్ చేశారు. బలగాలను మోహరించారు. అనంతరం అరెస్టు వారెంట్ జారీ చేసి కవితను అదుపులోకి తీసుకొన్నారు. ఆమె పేరుపై ముందే విమానం టికెట్ బుకింగ్ చేసి అదే రాత్రి ఢిల్లీకి తరలించారు. ఈడీ కార్యాలయానికి వెళ్లే దారులన్నింటినీ మూసేశారు. ఇప్పుడు కేజ్రీవాల్ విషయంలోనూ సరిగ్గా ఈడీ అధికారులు అదే ప్లాన్ అమలు చేశారు. అరెస్టు నుంచి రక్షణ కల్పించలేమని ఢిల్లీ హైకోర్టు చెప్పగానే.. కేజ్రీవాల్ ఇంటికి ఈడీ అధికారులు వెళ్లారు. కోర్టు సమయం ముగిసేంతవరకూ తనిఖీల పేరిట కాలయాపన చేశారు.



## ఎప్పుడు.. ఏం జరిగింది?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): 2021లో తీసుకొచ్చిన ఢిల్లీ నూతన మద్యం పాలసీలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ.. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను పలుమార్లు విచారించిన సీబీఐ.. 2023, ఫిబ్రవరి 26న అరెస్టు చేసింది. అప్పటినుంచి ఇప్పటివరకూ 390 రోజులపాటు ఆయన జైలు జీవితాన్నే గడుపుతున్నారు. ఇదే కేసులో ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్‌సింగ్‌ను కూడా గత అక్టోబర్‌లో ఈడీ కస్టడీలోకి తీసుకొన్నది. గత శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారు. ఇక ఇదే కేసు విషయమై గత ఏడాది నవంబర్ 2న తొలిసారి కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. 2023 డిసెంబర్ 21న రెండోసారి, ఈ ఏడాది జనవరి 3న మూడోసారి, అదేనెల 18న నాలుగోసారి, ఫిబ్రవరి 2న ఐదోసారి, అదే నెల 19, 26న వరుసగా ఆరోసారి, ఏడోసారి, మార్చి 4న ఎనిమిదోసారి కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు ఇచ్చింది. చివరగా గురువారం తొమ్మిదోసారి నోటీసులు జారీ చేసింది. అయితే, విచారణకు కేజ్రీవాల్ హాజరుకాలేదు.

## ఆప్ నిర్వీర్యమే లక్ష్యమా?

- లోక్‌సభ ఎన్నికల్లో ఆరు రాష్ట్రాల్లో ఆప్ పోటీ
- సరిగ్గా ఎన్నికల వేళ అరెస్టు వెనుక వ్యూహమేంటి?
- ఆప్ ఎదుగుదలను అడ్డుకునే ప్రయత్నమా?

న్యూఢిల్లీ, మార్చి 21: సామాన్యుడి పార్టీగా అవతరించి దేశ రాజకీయాల్లో సంచలనాలు సృష్టించింది ఆమ్ ఆద్మీ పార్టీ. ఢిల్లీలో మూడుసార్లు అధికారంలోకి వచ్చి పట్టు సాధించిన తర్వాత పంజాబ్‌లో అనూహ్య విజయం సాధించి అధికారాన్ని దక్కించుకుంది. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో 12.92 శాతం ఓట్లు, ఐదు ఎమ్మెల్యేలను గెలిచి బీజేపీకి సవాల్ విసిరే స్థాయికి చేరింది. గోవాలో గణనీయ ఫలితాలను అందుకున్నది. జాతీయ పార్టీగా గుర్తింపు సాధించి బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదిగే ప్రయత్నాల్లో ఉంది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీకి ఆమ్ ఆద్మీ పార్టీ కొరకరాని కొయ్యగా మారిపోయింది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఢిల్లీలో చిత్తుగా ఓడించింది. ఈ నేపథ్యంలో ఆమ్‌ఆద్మీ పార్టీని బీజేపీ పెద్దలు లక్ష్యంగా చేసుకున్నారనే వాదన బలంగా వినిపిస్తున్నది. ఆప్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగానే కేంద్రంలోని పెద్దలు పావులు కదుపుతున్నారని, ఈ దిశగానే దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారనే ఆరోపణ ఉంది.

**లోక్‌సభ ఎన్నికల్లో అడ్డుకునే వ్యూహమా ?**

ముందుగా సత్యేందర్ జైన్‌ను, ఆ తర్వాత మనీష్ సిసోడియాను, ఇప్పుడు కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. సరిగ్గా లోక్‌సభ ఎన్నికల వేళ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా ఆ పార్టీ శ్రేణులు డీలా



సత్యేందర్



సిసోడియా

పడేలా చేయాలనే బీజేపీ వ్యూహం ఉందనే అనే అనుమానాలు ఉన్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ ఈసారి ఎన్నికల్లో ఇండియా కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉంది. ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, గోవా, హర్యానా, అస్సాంలోనూ పోటీ చేయాలని ఆప్ నిర్ణయించింది. కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తారనే ప్రచారం దాదాపుగా ఏడాదిగా ఉండగా.. సరిగ్గా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికలకు సన్నద్ధం అవుతున్న వేళ అరెస్టు చేయడం వెనుక బీజేపీ రాజకీయ కుట్ర ఉన్నదని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.

**పార్టీని నడిపించేది ఎవరు ?**

ఆమ్ ఆద్మీ పార్టీకి కేజ్రీవాలే కన్వీనర్. ఆయనే స్టార్ క్యాంపెయినర్. ఆయన అరెస్టు పార్టీకి పెద్ద దెబ్బ. కేజ్రీవాల్ అరెస్టుతో ఆయన స్థానంలో ఆయన భార్య సునీత పార్టీ పగ్గాలు అందుకుంటారనే ప్రచారం ఉంది. పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఢిల్లీ మంత్రి ఆతిశీ పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

# అ 'సామాన్యుడు'

న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో అ'సామాన్యుడు' అరవింద్ కేజ్రీవాల్. ఐఆర్‌ఎస్ అధికారిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి.. అన్నాహజారేతో కలిసి అవినీతిపై పోరాటం సాగించి.. ఆమ్‌ఆద్మీపార్టీ పేరుతో రాజకీయ పార్టీని స్థాపించి.. రాజకీయాల్లోకి వచ్చీ రాగానే ఢిల్లీకి ముఖ్యమంత్రి అయ్యారు కేజ్రీవాల్. కేంద్రంతో ఢీ అంటే ఢీ అంటూ క్రమంగా తన పార్టీని ఇతర రాష్ట్రాలకు విస్తరింప చేశారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి తొలి దశ పోలింగ్‌కు నోటిఫికేషన్ వెలువడిన తరుణంలో కేజ్రీవాల్ అరెస్ట్ కావటం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ ప్రస్థానంపై ప్రత్యేక కథనం.



సుమారు పదేండ్లుగా దేశంలో ఎదురులేని ప్రధాని నరేంద్రమోదీకి కేజ్రీవాల్ కొరకరాని కొయ్యగా మారారు. ఎక్కడైనా ఒకే కానీ.. ఢిల్లీలో మాత్రం కాదంటూ మోదీకి సవాల్ విసిరి రెండు పర్యాయాలు ఢిల్లీ పీఠాన్ని చేజిక్కించుకున్నారు. తాను స్థాపించిన ఆప్‌ని క్రమంగా విస్తరిస్తూ పోతున్నారు. ఢిల్లీ తర్వాత పొరుగున ఉన్న పంజాబ్‌లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. గోవాలో కూడా ఆప్ పోటీ చేసినా విజయం అందుకోలేకపోయింది. సమీప భవిష్యత్తులో ఆప్ నుంచే ముప్పు తప్పదన్న భయాన్ని బీజేపీలో కలిగించారు కేజ్రీవాల్. ఇదంతా ఒక్క రోజులోనో, ఏడాదిలోనో సాధ్యమైనది కాదు.. దీని వెనుక అతని దార్శనికత, పట్టుదల, అకుంఠిత దీక్ష, దక్షత, రాజనీతిజ్ఞత దాగున్నాయి.

**హర్యానా టు హస్తినాపురి..**

హర్యానాలోని ఓ కుగ్రామంలో పుట్టిన కేజ్రీవాల్ అంచెలంచెలుగా ఎదుగుతూ ఢిల్లీకి ముఖ్యమంత్రి అయ్యారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయన ఖరగ్‌పూర్ ఐఐటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. కొంత కాలం టాటాస్టీల్స్ పనిచేసిన ఆయన.. 1993లో సివిల్స్‌లో నెగ్గి ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌లో చేరారు. అక్కడ తన తోటి ఐఆర్‌ఎస్ అధికారిణి సునీతను పెళ్లాడారు. నకిలీ రేషన్ కార్డుల కుంభకోణాన్ని బయటపెట్టేందుకు 1999లో పరివర్తన్ ఉద్యమాన్ని చేపట్టడంతో తొలిసారి ఆయన వెలుగులోకి వచ్చారు. ఆదాయ పన్ను, విద్యుత్తు, ఆహార, రేషన్ పదార్థాల అంశాల పట్ల ఢిల్లీ ప్రజల పక్షాన కేజ్రీవాల్ పోరాడారు. ఈ క్రమంలో ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి మరిన్ని సామాజిక సమస్యలపై పోరాటానికి సిద్ధమయ్యారు. 2006లో పబ్లిక్ కాజ్ రిసెర్చ్ ఫౌండేషన్ స్థాపించారు.

**అన్నాహజారేతో కలిసి..**

2010లో ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారేతో కలిసి జన్‌లోక్‌పాల్ బిల్లు ఆమోదం కోసం పోరాడారు. ఈ ఉద్యమంతో కేజ్రీవాల్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. అవినీతికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంలో రాజకీయ జోక్యాన్ని అన్నా హజారే నిరసించారు. ఇదే అంశంపై అన్నా హజారేతో కేజ్రీవాల్ విభేదించారు. దేశ ప్రజాస్వామ్యం, అవినీతి అంశాలపై తన ఆలోచనలు, అభిప్రాయాలను తెలియచేస్తూ స్వరాజ్ అనే పుస్తకాన్ని రాశాడు కేజ్రీవాల్. ఆ తర్వాతే 2012, నవంబర్ 26న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పేరుతో రాజకీయ పార్టీని స్థాపించారు. 2013లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేసింది. తొలి ప్రయత్నంలోనే 70 సీట్లకు గాను 28 సీట్లను గెల్చుకున్నది. ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో కాంగ్రెస్ షరతులతో కూడిన మద్దతునివ్వటంతో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తొలిసారి ఢిల్లీకి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే జన్‌లోక్‌పాల్ బిల్లు ఆమోదంలో వైఫల్యం చెందటంతో 49 రోజులకే సీఎం పదవికి రాజీనామా చేశారు. ఢిల్లీలో అప్పట్లో రాష్ట్రపతి పాలన విధించారు.

**భారీ మెజార్టీతో ముఖ్యమంత్రిగా..**

16వ లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రధాని మోదీపై పోటీచేశారు కేజ్రీవాల్. అయితే ఆ ఎన్నికల్లో ఆయన ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2015లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. 70 స్థానాలకు గాను 67 గెల్చుకుంది. తిరుగులేని మెజార్టీతో కేజ్రీవాల్ ఢిల్లీకి 7వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బంపర్ మెజార్టీతో అధికారంలోకి వచ్చారు. ఆయన పార్టీ 62 సీట్లను కైవసం చేసుకున్నది.

**కేజ్రీవాల్‌పై కేంద్రానికి ఎందుకంత ఆగ్రహం..**

తన హయాంలో ఢిల్లీ ప్రజలకు చేసిన సేవలు కేజ్రీవాల్‌ను తిరుగులేని నేతగా నిలబెట్టాయి. సర్కారీ స్కూళ్లను, దవాఖానలను ఆయన కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది దేశానికే ఆదర్శంగా నిలిపారు. దీనికితోడు మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను కేజ్రీవాల్ విమర్శిస్తూ వచ్చారు. కేంద్రానికి వ్యతిరేకంగా పంజాబ్, హర్యానా రైతులు చేపట్టిన సుదీర్ఘ దీక్షకు పరోక్షంగా కేజ్రీవాల్ మద్దతునిస్తున్నాడని మోదీ సర్కారు అనుమానిస్తున్నది.

**నిరాడంబరుడు..**

అందరు రాజకీయ నాయకుల్లాగా కాకుండా కేజ్రీవాల్ చాలా నిరాడంబరంగా ఉంటారు. ఆయన పూర్తిగా శాఖాహారి, రాజకీయాలు మినహాయిస్తే ఆయన బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్‌కు అభిమాని, కామెడీ మూవీస్‌ను బాగా ఇష్టపడతారు. తన డెస్క్‌ను తానే స్వయంగా శుభ్రం చేసుకుంటారు. నౌకర్ల అవసరం లేకుండా తన పనులను తానే చేసుకుంటారు. మొత్తానికి తనదైన రాజకీయ శైలితో, వ్యక్తిగత క్రమశిక్షణతో ప్రజలకు సేవ చేయాలన్న తపనతో దేశ రాజకీయాల్లో విలక్షణ నేతగా, అనితర సాధ్యుడిగా అరవింద్ కేజ్రీవాల్ నిలిచాడన్నది జనాభిప్రాయం.



### ఒక్క బీజేపీ నేతనైనా అరెస్ట్ చేశారా?

దశాబ్ద కాలంగా తమ పాలనా వైఫల్యాలు, ఓటములను కప్పిపుచ్చుకోవడానికే ఫాసిస్ట్ బీజేపీ.. కేజ్రీవాల్, సోదరుడు హేమంత్ సోరెన్‌లను అరెస్ట్ చేసింది. ఈ శతాబ్ద కాలంలో కనీసం ఒక్క బీజేపీ నేత మీద అయినా దర్యాప్తు కానీ, అరెస్ట్ కానీ జరిగిందా? కేవలం విపక్షాలపై కక్ష కట్టి వారిని వేటాడుతున్నారు. వారి చర్యల ద్వారా ఇప్పుడు నిజస్వరూపం బయటపడింది. వారి ఈ వేధింపులు ఇండియా కూటమి విజయాన్ని ఆపలేవు.

– తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

### పిరికితనాన్ని నిరూపిస్తున్నది

సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రశ్నించే గళాలను అణచివేసేందుకే ఉద్దేశపూర్వకంగా కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. ఇది తీవ్ర అభ్యంతరకరం. ప్రజాస్వామ్య ప్రక్రియకు భయపడే వారి పిరికితనాన్ని నిరూపిస్తున్నది.

–కేరళ సీఎం పినరయి విజయన్



### ఈడీ, సీబీఐలే బీజేపీ అస్త్రాలు

బీజేపీ చేతిలో ఈడీ, సీబీఐలు ప్రధాన అస్త్రాలుగా ఉన్నాయి. వాటి ద్వారా ఎలాంటి ఆధారాలు లేకపోయినా ప్రత్యర్థులను అణచివేయడం, రాజకీయ ప్రతీకారానికి దిగడం ఆ పార్టీ ఏకైక లక్ష్యం.

–బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### విపక్షాలను లేకుండా చేయడానికే..

కేజ్రీవాల్ అరెస్ట్ ప్రజా విప్లవానికి జన్మనిస్తుంది. ఎవరైతే ఓటమి భయంతో బందీలవుతారో వారు ఇతరులను జైలుకు పంపడానికి ప్రయత్నిస్తారు. కేంద్రంలో తిరిగి అధికారంలోకి రామని బీజేపీకి తెలుసు. ఆ భయంతోనే విపక్ష నేతలను ఎన్నికల నాటికి ప్రజల మధ్య లేకుండా చేయాలనుకుంటున్నది.

– ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్

## కేజ్రీ అరెస్టుపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

న్యూఢిల్లీ, మార్చి 21: ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడంపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరుపనుంది. కేజ్రీవాల్ అరెస్టును వ్యతిరేకిస్తూ ఆయన తరపు న్యాయవాదులు గురువారం రాత్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఈడీ అరెస్టును సవాలు చేసిన న్యాయవాదులు తమ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని రిజిస్ట్రీకి విజ్ఞప్తి చేశారు. అర్ధరాత్రి అయినా విచారణ జరపాలని కేజ్రీవాల్ తరపు న్యాయవాదులు కోరారు. అయితే పిటిషన్‌ను స్వీకరించిన రిజిస్ట్రీ దానిపై శుక్రవారం విచారణ జరుపుతామని సమాచారమిచ్చింది.

## ఈడీకి వ్యతిరేకంగా ఆప్ నిరసనలు

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపాయి. ఉత్తర ఢిల్లీలోని సివిల్ లైన్స్‌లో ఉన్న కేజ్రీవాల్ ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు చేస్తున్నారనే సమాచారం రాగానే ఆప్ ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు వందలాదిగా చేరుకున్నారు. బీజేపీకి, ఈడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈడీ కార్యాలయం ముందు కూడా ధర్నా చేశారు. దీంతో పోలీసులు ఆప్ ఎమ్మెల్యేలు జర్నైల్ సింగ్, రుతురాజ్, జై భగవాన్, అబ్దుల్ రెహమాన్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

## కులగణన దివ్యౌషధమేం కాదు

### కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ సంచలన వ్యాఖ్యలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 21(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ తీసుకొంటున్న విధానాలపై సొంతపార్టీ నేతల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే జాతీయస్థాయిలో కులగణన చేపడతామంటూ ఇటీవలి కాలంలో కాంగ్రెస్ పెద్దయెత్తున ప్రచారం చేస్తున్నది. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన అంశాన్నే ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. అయితే కులగణన డిమాండ్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఆనంద్‌శర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'కులగణన' దివ్యౌషధం కాదని, సమాజంలో నెలకొన్న నిరుద్యోగం, అసమానతలను ఇది తొలగించబోదని పేర్కొన్నారు. కులగణనపై కాంగ్రెస్ తాజాగా తీసుకొన్న నిర్ణయం.. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విధానాలకు విరుద్ధంగా ఉన్నదని కుండబద్దలు కొట్టారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఓ లేఖ రాశారు.

**గతంలో ఎన్నడూ లేదు..**

'కులాలు చూసి కాదు.. చెయ్యి గుర్తు చూసి ఓటేయండి' అని 1980లో ఇందిరాగాంధీ ఎన్నికల్లో నినదించారు. ఎన్నికల్లో కులతత్వాన్ని ఓ అంశంగా మారిస్తే, సమస్యలు వస్తాయంటూ 1990లో రాజీవ్‌గాంధీ సైతం దీన్ని వ్యతిరేకించారు. అలాంటిది కులగణన పేరిట మనం ఇప్పుడు వారి ఆదర్శాల నుంచి దూరం జరగడం ఆందోళన కలిగిస్తున్నది' అని శర్మ లేఖలో పేర్కొన్నారు.

## బాడీ మసాజర్ సెక్స్ టాయ్ కాదు

### దిగుమతిపై నిషేధాన్ని రద్దు చేసిన బాంబే హైకోర్టు

ముంబై: బాడీ మసాజర్ పరికరాన్ని సెక్స్ టాయ్‌గా పరిగణించలేమని.. వాటిని నిషేధిత దిగుమతి వస్తువుల జాబితాలో చేర్చలేమని బాంబే హైకోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. గతంలో దీనిపై కస్టమ్స్ విభాగం ఇచ్చిన ఆదేశాలను కోర్టు కొట్టివేసింది. కస్టమ్స్ కమిషనర్ బాడీ మసాజర్‌ను సెక్స్ టాయ్‌గా ఊహించుకొని ఉంటారని.. అందుకే నిషేధిత వస్తువుల జాబితాలో ఉంచారని కోర్టు వ్యాఖ్యానించింది. మే 2023లో కేంద్ర ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశాలను సవాల్ చేస్తూ కస్టమ్స్ కమిషనర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు ఈ సందర్భంగా కొట్టేసింది.